## ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతూ, ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలపై పోరాడండి!

# పెట్రో, డీజల్, నిత్యావసర సరుకుల ధరల తగ్గింపు కోసం, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఇంటి పన్నుల రద్దు కోసం, కరోనా సహాయక చర్యల కోసం డిమాండ్ చేద్దాం!

**అంతర్జాతీయంగా** పెట్రోలియం ధరలు తగ్గుతున్న కాలంలో మనదేశంలో పెట్రోలు, డీజిలు, వంట గ్యాసు ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ పెరుగుదలకు కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరోవైపు నుండి పన్నులు వడ్డించడమే. పెట్రోలియం కంపెనీలకు ప్రభుత్వం అనుమతి కోసం చూడకుండా ఎప్పటికపుడు పెంచుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. ఒకే దేశం, ఒకే పన్ను నినాదంతో తెచ్చిన జిఎస్‌టి పరిధి నుండి కూడ తప్పించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతైనా పన్నులు పెంచే అవకాశం పెట్టుకున్నారు. దీంతో రవాణా ఖర్చులు పెరిగాయన్న సాకుతో నిత్యజీవితావసర సరుకులన్నిటి ధరలు పెరిగి పోయాయి. కరోనా కాలంలోనే వంటనూనెల ధరలు, పప్పులధరలు దాదాపు రెట్టింపు చేశారు. మరోవైపు పంటలు పండించే రైతుకు గిట్టుబాటు ధర కాకున్నా మద్దతుధర కూడ ఇవ్వ నిరాకరిస్తున్నారు.

కరోనా ఫలితంగా గత సం॥ ఆకస్మికంగా లాక్‌డౌన్ ప్రకటించి వలస కూలీలను అత్యంత దయనీయ స్థితికి నెట్టారు. ఈ సంవత్సరం 2వ వేవ్ వస్తుందన్న శాస్త్రవేత్తల హెచ్చరికలను పట్టించుకోలేదు. ముందు జాగ్రత్తగా వేక్సిన్ కూడ వేయనందు వల్ల కోట్లాది మందిని కరోనా బారిన పడవేశారు. వారికి వైద్యం కల్పించే, మందులు అందించే, ఆక్సిజన్ అందించే బాధ్యత కూడ చేపట్టకుండా జనం పిట్టల్లా రాలి పోతుంటే కేంద్ర, రాష్ట్ర పాలకులు మా బాధ్యత లేదన్నట్లు వ్యవహరించారు. పెరిగిన వైద్య ఖర్చులవల్ల, కుటుంబ ఖర్చులవల్ల, లాక్‌డౌన్ ఫలితంగా ఉపాధి కోల్పోయినందు వల్లా సుమారు 23 కోట్ల మంది ప్రజలు, ఉన్న కొద్ది ఆస్తులు కూడ కోల్పోయి దరిద్రులుగా మారారని గణాంకాలు చెప్పాయి.

ఈ కరోనాతో సంవత్సర కాలంగా ప్రజల జీవితం అస్తవ్యస్తం అయిపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం మరో సమ్మెట పోటుకు పూనుకుంది. పట్టణ ప్రాంతాలన్నిటిలో మునిసిపాలిటీలు, నగర కార్పొరేషన్లు అన్నిటిలో గతంలో అద్దె విలువ ప్రాతిపదికన వేస్తున్న ఆస్తి పన్ను (ఇంటి పన్ను)ను మార్కెట్ విలువ (స్థలం విలువ, కట్టడం విలువ)ను బట్టి విధిస్తూనూ–చెత్త సేకరణకు కొత్త పన్నులు విధిస్తూను జీవోలు విడుదల చేసింది. దీంతో ఇంటి పన్నులు 5,6 రెట్లు పెరిగాయి. ఫలితంగా ఉపాధి పూర్తిగానో, పాక్షికంగానో కోల్పోవడం, మరోవైపు ఇంటి ఖర్చులు రెట్టింపు కావడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు బతుకే భారమైంది. నిరుద్యోగం కొండలా పెరుగుతున్నా పాలకుల్లో ఉలుకూపలుకూ లేదు. ఉచిత పథకాలు, నగదు

బదిలీల పేరిట ప్రజల్ని మోసపుచ్చుతూ పరోక్ష పన్నుల భారాల్ని పెంచి–ఇచ్చేది దోసకాయంత, దోచుకునేది గుమ్మడికాయంతగా – మోస గిస్తున్నారు. ప్రజలు ఈ మోసాన్ని గుర్తించాలి.

ఈ నేపథ్యంలో ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ఈ క్రింది డిమాండ్ల కోసం పోరాడమని కమ్యూనిస్టు విప్లవ సంస్థలు ఉమ్మడిగా ప్రజలకు పిలుపునిస్తున్నాయి.

1. పెంచిన పెట్రోలు, డీజిలు, వంట గ్యాసు ధరలు తగ్గించాలి. వీటిని జిఎస్‌టి పరిధిలోకి తేవాలి. వ్యవసాయానికి వాడే డీజిల్‌ను సబ్సిడి ధరకు అందించాలి.
2. వంట నూనెలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి.
3. కరోనా బారినపడిన ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల వ్యవస్థను బలోపేతం చేయాలి. మందుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి.
4. మండల, గ్రామ స్థాయిలలోనే కోవిడ్ ఐసొలేషన్ సెంటర్లు ప్రభుత్వం నడపాలి.
5. ప్రజలందరికీ, పిల్లలతో సహా ఉచిత వ్యాక్సిన్లు వేయాలి. ఇందుకోసం వ్యాక్సిన్‌పై పేటెంట్ హక్కులతో ప్రమేయం లేకుండా ఫార్మా కంపెనీలన్నిటిచే వాక్సిన్ ఉత్పత్తి చేయించాలి.
6. ఆదాయపు పన్ను పరిధిలోకి రాని కుటుంబాలన్నిటికీ నెలకు 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని, బియ్యంతో పాటు ఇతర నిత్య జీవితావసర సరుకుల్ని ప్రభుత్వం అందించాలి.
7. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పన్నుల, చెత్త పన్నుల పేరిట మోపుతున్న అదనపు భారాన్ని ఉపసంహరించాలి.

**జూన్ 18 నుండి ప్రచారం ప్రారంభం– 21న మున్సిపాలిటీలు, 28న రెవిన్యూ డివిజన్, కలెక్టరు కార్యాలయాల ముందు ఆందోళనలు చేపట్టండి.**

విప్లవాభినందనలతో

**విజయవాడ**
**15-6-2021**

**సి.పి.ఐ. ఎం.ఎల్. న్యూడెమాక్రసి**
**సి.పి.ఐ. ఎం.ఎల్.**
**సి.పి.ఐ. ఎం.ఎల్. న్యూడెమాక్రసి**
**సి.పి.ఐ. (ఎం.ఎల్) జనశక్తి**
**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీలు**